## తరతరాలుగా పురుషాహంకారానికి బలి అవుతున్నా స్త్రీ తాళికోసం ఎందుకు అల్లాడిపోతుంది?

# ప్రేక్షకురాలు

ఇంద్రకంటి జానకీబాల కథ

అక్కా,

మూడు నెలలుగా నీకు ఉత్తరం రాద్దామని, అశక్తతవల్ల రాయలేక వుండిపోయాను. కాగితం, కలం తీసుకుని కూర్చుంటే కన్నీళ్లొస్తున్నాయికానీ కలం కదలడంలేదు. అగ్గిలాంటి అవమానం గుండెల్ని మండించేస్తుంటే ఓర్చుకోవడం దుర్లభంగా వుంది. నీ ముందు నా బాధ చెప్పుకోడానికి కూడా అర్హత లేనిదాన్ని కానీ తిట్టినా తిమ్మినా నీకంటే నాకెవరున్నారు అనే ఊహ శక్తినిస్తుంటే ఈ సుదీర్ఘ లేఖ రాయడానికే నిర్ణయించుకుని కూర్చున్నాను.

అక్కా,

వైజయంతి కాపురం కుప్పకూలిపోయింది. దాని జీవితం రెండోసారి మొదటికొచ్చింది.

అప్పటికే కనుకొనుకుల్లో చేరిన కన్నీళ్లు ఒక్కసారి పొంగి, రమాదేవి చెంపలమీద జరజరా రాలాయి. కళ్లు గట్టిగా మూసుకుని బాధతో తల వెనక్కి వాల్చి మూలిగింది.

ఎన్నెన్నో సంఘటనల పరంపర ఆమె మనో నేత్రం ముందు ఫోటోగ్రాఫ్స్‌లా కదిలాయి.

★ ★ ★

రమాదేవి ఆటో దిగి ఇంట్లోకి వెళ్తుంటే ఎదురొచ్చి తన కలువ కాడల్లాంటి చేతులు మెడచుట్టూ వేసి ''పెద్దమ్మొచ్చేసిందోచ్'' అంటూ చేతుల నిండుగా వున్న ఎర్రని గాజులు బుగ్గలలో మెరుస్తుండగా సిగ్గులు మొగ్గైన వైజయంతి వయస్సు పదహారుసంవత్సరాలు మాత్రమే.

కాళ్లకి వెండి మువ్వల పట్టాలు. అరచేతుల్లో పండినగోరింటాకు చిత్రాలు. చెమికీ పూలు కుట్టిన ఓణీ - తళతళా మెరిసిపోతున్న వైజయంతిని చూస్తే రమాదేవికెందుకో పెద్ద ఆనందం కలగలేదు. పాలుగారే ఆ మోవములో పసితనం ముద్దుగా వుందిగానీ, పూర్తిగా మనసూ, వయసూ ఎదగని



ఏదో అమాయకత్వం -

అక్కడికీ ఉండబట్టలేక చెల్లెలు కౌసల్యని నెమ్మదిగా అడిగింది.

''దానికేమంత వయసైపోయిందని ఇంత తొందరగా పెళ్లి కుదిర్చారే''

కౌసల్య ఆశ్చర్యంగా కళ్లు పెద్దవిచేసి అక్కవైపు అరక్షణం చూస్తూండిపోయింది.

''భలే చెప్పావు. మంచి సంబంధం.

వెతుక్కుంటే దొరుకుతుందా? అదృష్టంగా ఎదురొచ్చింది. ఇది పెళ్లి చేసే వయసే. అది పన్నెండేళ్లకే పెద్ద మనిషైంది'' అంది కౌసల్య. ఆ చెప్పడం తనకున్న తెలివంతా ప్రదర్శించావన్న గర్వం తొణికిస్తూ చెప్పింది.

వైజయంతి పెళ్లికూతురి బొమ్మలా కూర్చుంది. ఆ శుభసంతర్భంలో మరేం మాట్లాడినా అపశ్రుతిలా వినిపిస్తుందని రమాదేవి మరేం మాట్లాడలేదు.

★ ★ ★

ఆరు నెలల తర్వాత అర్జంటుగా కబురొస్తే బయలుదేరి చెల్లెలి గుమ్మం ఎక్కుతుంటే వాడిపోయిన ముఖంతో చిక్కి శల్యమైన వైజయంతి ''వచ్చావా పెద్దమ్మా'' అంటూ బేలగా కౌగిలించుకుని బావురుమంది. బూరెల్లాంటి ఆమె బుగ్గలు మాడిన అప్పడాల్లా వికారంగా అయిపోయాయి. మెడకింద ఎముకలు పొడుచుకొచ్చి కళ్లల్లో కాంతిపోయి, ఊచల్లా కాళ్లూ చేతులు, ప్రాణమున్న అస్థిపంజరంగా - రమాదేవి అవాక్కయి నిలబడిపోయింది.

అత్తగారు, మామగారు, ఆడబడుచు, మరిది - భర్త సరేసరి - ఇందరికీ వండి వార్చి, ఇంటి పెత్తనమంతా మీద వేసుకుని చలాకీ తారలా తిరగడంలో పూర్తిగా ఫెలయిన మందభాగ్యురాలు వైజయంతి.

కోడలొచ్చిందని ఇక సుఖపడాలని అత్తగారు విశ్రాంతి, భార్య చేతి వంట విసుగెత్తింది... ఈ పడుచుపిల్ల కొత్త రుచులకోసం మామగారు, వదిన మోజులో మరిది, ఆడపడుచు హోదాలో అమ్మణ్ణి, అలసి రాత్రి పదకొండు గంటలకు గదిలో అడుగుపెట్టిన పెళ్లాంమీదకి ఆబగా దూకే మొగుడు. తనకన్నా పదేళ్లు చిన్నదైన భార్యని ఇన్‌స్ట్రుమెంట్‌గానే చూశాడు మగధీరుడూనీ, స్నేహాన్ని పంచలేదు.

ఏది ఎలా చెప్పాలో, ఎవ్వరినెలా మెప్పించాలో తనని తనెలా రక్షించుకోవాలో తెలీని పసిపిల్ల వైజయంతికి ఏడుపొక్కటే శరణ్యమైంది. అసలే పని రాదు. చేతకాదు. ఓపిక లేదు. భయం. అక్కడితో గొడవలు మొదలై పెరిగి పెరిగి రాద్ధాంతమై కొనఊపిరిలో పిల్లను తీసుకొచ్చాక అత్తవారి అభియోగం -

పిల్ల పెంకిది, పిల్లకి పనిపాటలు రావు.

పిల్లకి పెద్దలందు భయభక్తులు లేవు.

ఆడబిడ్డని ఆదరించలేదు. (ఆ ఆడబిడ్డ ఈమెకంటే ఒక ఏడాది పెద్దది)

కౌసల్యా, స్వామి బిక్కచచ్చిపోయారు. కూతుర్ని ఎలా మళ్లీ అత్తారింటికి పంపాలా అని తల్లడిల్లిపోయారు. ఇన్నిటికంటె ముఖ్యం వైజయంతి అమ్మా నాన్నల కాళ్లకి చుట్టుకుపోయి ''నేను మరింక ఆ ఇంటికి వెళ్లను బాబో అని గోల పెట్టేసింది. ఆమె జడుసుకున్న తీరునుబట్టి కౌసల్య నోరు విప్పలేకపోయింది.

వైజయంతిని బుజ్జగించి అడిగితే ఎన్నో చెప్పింది. పంతాలు పెరిగిపోయాక ఆ ఇంట్లో ఆ చిన్నారి ఎంతో హింసకి గురైంది. బందిఖానాలో వున్నట్లు క్రుంగిపోయి, ఎప్పుడు బయటపడతానా అని తపించిపోయింది.

మూడేళ్లు కష్టపడి వైజయంతికి విడాకులు పొందగలిగారు. ఆ రోజున, ఆ ఇంట్లో అందరూ ఒక విషాదంలోంచి, ఒక విశ్రాంతి పొందారు. అయితే వాళ్లలో పొంగిన ఉక్రోషం, ఆవేశం అంతా ఇంతా కాదు.

''నా కూతురికి ఆరు నెలల్లో మళ్లీ పెళ్లి చేయకపోతే నా పేరు నరసింహస్వామే కాదు'' అని తండ్రి-

''నా కూతురికి పెళ్లిచేసి మనవడ్ని ఎత్తుకోకపోతే

నా పేరు కౌసల్యే కాదు అని తల్లి.

''మా అక్కకి మళ్లీ పెళ్లయితేగానీ నేను పెళ్లిచేసుకోను'' అని చెల్లీ ప్రతిజ్ఞలు చేశారు.

ఆమెకి అన్నివైపులా ప్రతిజ్ఞల వలయం చుట్టారు. ఆ వలయంలో పెళ్లి అనే ఒకే ఒక కేంద్రంలో బంధితురాలై వుండిపోయింది వైజయంతి.

ఇవన్నీ చూస్తూ, వింటూ రమాదేవి ఏం మాట్లాడలేకపోయింది. ఇలాంటి విషయాల్లో ఏదైనా సలహా చెప్పడం ఎంత కష్టమో ఆమె ప్రత్యక్షంగా అనుభవించి చూసింది.

ముందు చెప్తే - శుభమాని కార్యక్రమం పెట్టుకుంటే ఆదర్శాలు, నీతులు, జాగ్రత్తలూ చెప్తారేమిటి శకున పక్షుల్లా అంటారు. పోనీ అంతా అయ్యాక చెప్తే లాభమూ వుండదు. పైగా మేమెంతో కష్టంలో వుండి బాధపడుతుంటే వీళ్లు నీతులు, ఆదర్శాలు చెప్తున్నారు. ఒడ్డున వుండి మాట్లాడ్డం సులువే'' అంటారు.

కాబట్టి ఈ ప్రపంచంలో ఎవరు చెప్పినట్టూ ఎవరూ వినరు. ఊరికే అడుగుతారు. చివరికి వాళ్లకిష్టమొచ్చినట్లే చేస్తారు అని రమాదేవికి అర్థమైంది.

సరిగ్గా ఇది జరిగిన మూడు నెలలకే కబురందింది అర్జంటుగా రమ్మని.

తన ప్రమేయం లేకపోయినా కౌసల్య తనకి సొంత చెల్లెలు కావడంవల్ల వాళ్ల మంచి చెడ్డలలో పాలుపంచుకోకుండా వుండడానికి రమాదేవికి వీలుపడదు.


★ ★ ★

రమాదేవి ఇంట్లో అడుగుపెట్టేసరికి రుక్కూ సతీష్ కలిసి గుమ్మాలకి ప్లాస్టిక్ మామిడాకుల తోరణాలు కడుతున్నారు. సతీష్ ఒక్క దూకు దూకి పెద్దమ్మొచ్చిందోహో...'' అంటూ ఇంట్లోకి పరుగెట్టాడు.

రుక్కు రమాదేవివైపు చూసి నవ్వింది.

''మీ అమ్మేదే'' అంటూ లోపలకడుగుపెట్టేలోగా వంటింట్లోంచి కౌసల్య, పక్క బెడ్‌రూంలోంచి వైజయంతి ఒకేసారి వచ్చారు.

అక్కయ్యని చూసి కౌసల్య ముఖం వికసించింది. వైజయంతి రమాదేవిని కౌగలించుకుంది. ఆ పిల్లకి పెద్దమ్మ మీద ఎంతో



అభిమానం. ఒక్క క్షణం వైజయంతి వేషంలో వచ్చిన మార్పుకి రమాదేవి మనసు ఏదోలా అయిపోయింది.

''అమ్మయ్య వచ్చావా తల్లీ! నీ కోసమే వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాను'' అంది కౌసల్య మంచినీళ్ల గ్లాసు అందిస్తూ.

మంచినీళ్లు అందుకుని ''ఏమిటే కౌసీ! టెలిగ్రామిచ్చి మరీ రమ్మన్నావు. ఏమిటీ విశేషం. క్షేమం అనిరాశారుగాబట్టి లేకపోతే హడలి చచ్చేదాన్ని''

''చెప్తా చెప్తా అంటూ గ్లాసందుకుని అటూ ఇటూ చూసింది. వైజయంతి పెద్దమ్మని వదిలి లోపలికెళ్లిపోయింది.

నెమ్మదిగా, గంభీరంగా ''ఇదిగో అక్కా, దీనికి సంబంధం రావడం, కుదిరిపోవడంకూడా సడన్‌గా జరిగిపోయాయి'' అంది.

రమాదేవి ఉలిక్కిపడింది.

''వైజయంతికా'' అంది నమ్మలేకుండా.

''అవును''

''ఏమిటీ? దానికిప్పుడు మళ్లీ పెళ్లా'' అంది ఆపుకోలేక.

కౌసల్య ముఖం అపార్థంతో అవమానంతో నల్లబడింది.

''నువ్వుకూడా అలాగంటావేమిటే అక్కా'' అంది నిష్ఠూరంగా.

''నేనేమన్నాను? కానిమాటేం అనలేదే''

''మరేమిటి? దాని అదృష్టం ఇన్నాళ్లకి వెతుక్కుంటూ వస్తే''

కౌసల్య మాట పూర్తికాకుండానే రమాదేవిలో కోపం ఒక్కసారి కట్టలు తెంచుకున్న గోదావరిలా ఉరికింది. ముఖం ఎర్రగా కందగడ్డలా అయింది. అయినా తమాయించుకుని రెండు నిమిషాలు ఊరుకుంది.

సర్లే. విశేషాలు చెప్పు. అతనెవరు? ఏం చేస్తున్నాడు? ఏ ఊరు? తల్లిదండ్రులు - అన్నీ చెప్పారా! అంటూ మాట మార్చింది. కౌసల్య మళ్లీ ఉత్సాహం పుంజుకుంది.

అతను మిలిటరీలో పనిచేస్తున్నాడు. మూడేళ్ల తరువాత సివిల్ సర్వీసులోకి వచ్చేస్తాట్ట. వాళ్లు మనవాళ్లే. తల్లి, ఒక చెల్లెలు ఎంత మంచివాళ్లో చెప్పలేను'' అంది కౌసల్య.

''నీకెలా తెలుసు''

''వాళ్లు మాట్లాడుతుంటే తెలీదూ'' అంది దీర్ఘం తీస్తూ కౌసల్య.

మొదటి సంబంధమూ ఇలాగే అనుకున్నారు అందామనుకుని ఏడుస్తారని ఊరుకుంది.

''ఏమిటో పెళ్లంటే నూరేళ్ల పంట. దానికి మంచి మొగుడు దొరికితే అది జీవితంలో స్థిరపడినట్టే'' అంది కౌసల్య.

రమాదేవిలో ఆవేశం ఇంక ఆగిందికాదు. తన మనసులో వున్న భావాలు, ఆలోచనలు, ఆక్రోశం, ఆవేశం అన్నీ బయటకు చెప్పేయకుండా వుండలేని పరిస్థితామెకి ఏర్పడింది.

''అది సరేగానీ కౌసీ - నేను అడిగేది ఒక్కసారి విను. నే చెప్పినట్టు నువ్వు చేస్తావని కాదు. కానీ నేను చెప్పాననే సంతృప్తికోసం.

దానికి పెళ్లయి, విపరీతమైన గొడవలై, పిల్ల ప్రాణాలతో వుంటే చాలని తీసుకొచ్చి మూడేళ్లు కాలేదు. కోర్టు చుట్టూ తిరిగి విడాకుల డిక్రీ పొంది మూడు నెలలు కాలేదు. అసలుదానికి తగిలిన గాయం మానేందుకు సమయమిచ్చావా? తనగురించి తను ఆలోచించుకునే అవకాశం ఇచ్చావా? అది మనసు చెదిరి ఇంటికొచ్చినప్పటినుండి పెళ్లో పెళ్లో అని ఈ గోలేమిటే'' అంది.

కౌసల్య ఒక్కసారి జంకిపోయింది. అయినా

సర్దుకుని ''నీకేమే? నువ్వెన్ని కబుర్లైనా చెప్తావు. మగతోడు లేకుండా ఆడదెలా బతుకుతుంది? ఏదో నేనూ, ఆయనా వున్నంతకాలం ఫర్వాలేదు. ఆ తర్వాత...''

''ఛీ... నోర్ముయ్, మగతోడు మగతోడు అంటూ దాని బుర్రంతా పాడుచేసి, చెదపురుగులా దొలిచేశావు. పెళ్లికోసం, మగవాడికోసం ఎదురుచూడ్డం తప్ప, ఆడదానికి వేరే లేదని పిల్లల్ని చెడగొట్టావు. వైజయంతి జీవితంలో తిన్న దెబ్బకి దాని గురించి దానికి కొంత అవగాహన కలిగించావా? సొంతంగా బతికేందుకు, సొంతంగా ఆలోచించనిచ్చావా? తన కాళ్లమీద తను నిలబడాలన్న భావం కలిగించావా? ఆడదానికి పెళ్లి జీవితంలో ఒక భాగమేగానీ, జీవనోపాధి కాదని ఎప్పుడైనా చెప్పావా? స్త్రీకి వివాహం జీవితంలో ఒక భాగం అంతేగానీ వివాహమే జీవితం కాదు. భర్త అనేవాడు తోడూ నీడా - అంతేగానీ కూడూ గూడ్డా కాదు. ఏం? పెళ్లి లేకుండా కొన్నాళ్లు వైజయంతి స్వతంత్రంగా బతుకుతూ ప్రపంచాన్ని పరిశీలించి, లోకం గురించి తెలుసుకుని, దానికి నచ్చిన, తగినవాడ్ని దాన్ని అర్థంచేసుకున్నవాడ్ని పెళ్లిచేసుకోనివ్వచ్చుగా''

రమాదేవి ఆయాసపడుతూ ఆగింది.

కౌసల్య కళ్లల్లో నీళ్లూరడం గమనించి మరింక మాట్లాడలేదు.

''ఏదోలేవే - నీ అంత తెలివి నాకు ఎప్పుడూ లేదుగా'' అంది ముక్కు ఎగపీలుస్తూ.

''చాల్లే, ఇలాటి ఎత్తిపొడుపు మాటలు - నాను ముచ్చు కబుర్లు బాగా నేర్చావు. అయినా అన్నీ ఫిక్స్ అయిపోయాయిగా'' అంది రమాదేవి.

''ఆ...''

''వైజయంతి అన్నిటికీ ఇష్టపడిందా? పిల్లాడు నచ్చాడుట?''

''ఆ...''

''సర్లే! ఇంకే విషయాలు మరి నేను మాట్లాడను. స్వామితోకూడా నువ్వేం మాట్లాడకు''

''సరే'' అంది కౌసల్య కళ్లు తుడుచుకుంటూ.

ఆ రెండో పెళ్లి జరిగిన తీరు చూసి రమాదేవి మరీ ఆశ్చర్యపోయింది.

మధుపర్కాలు ఎలా కట్టాలనే విషయంలో రెండువైపుల సంప్రదాయాలు వల్లెవేసుకున్నారు.

## టిక్కెట్టు

''ఎప్పుడు ఊరెళ్లినా మీ ఆయన రైళ్లోనే వెడతారెందుకు?''

''బస్సుల్లో అయితే తప్పకుండా టిక్కెట్టు కొనాలిగా!''

- సిరిసిల్లా రశీద్ శిక్షక్ (దోస్కల్)



ఎవరి గొప్పతనం వారు చాటుకోచూశారు.

వడగంటిచీర మంచిది పెట్టలేదనీ, పానకం బిందెలు మరీ చిన్నవనీ, స్థాళీపాకం గిన్నె ఇవ్వలేదనీ, ఇలాంటి రభసలు చేస్తున్న ఆ మగపెళ్లివారిని చూస్తే రమాదేవికి అసహ్యమే వేసింది. ఆ పెళ్లికొడుక్కీ ఇది రెండో పెళ్లి. మొదటి పిల్లకి విడాకులిచ్చాడు.

''ఎందుకని'' అని రమాదేవి అడిగితే -

''ఆ పిల్ల పెంకిదట - చెప్పిన మాట వినదట. పైగా నల్లటి కొరివి మొద్దట'' అని కౌసల్య ఉత్సాహంగా చెప్పింది.

ఆ క్షణంలో కౌసల్యని చూసి రమాదేవి జాలి పడడం తప్ప మరేం చేయలేకపోయింది.

ఒకసారి ఆడపిల్లకి పెళ్లయి, జీవితంలో తీవ్రంగా దెబ్బతిన్న తర్వాతకూడా ఒక్కరికీ ఆ స్పృహగానీ, ఆ అనుభవంవల్ల కలిగిన వేదనగానీ గుర్తులేకపోవడం దురదృష్టకరం. ఇంకా పెళ్లిని ఒక వేడుకగా భావించగలగడం విచారకరం.

రమాదేవికి ఆ పెళ్లి చేదు మింగినట్లే అయింది.

★ ★ ★

వైజయంతి భయంభయంగా చూస్తూ నిలబడింది.

''అమ్మా! నాకు వెండి కుట్టుడాకులో భోజనమంటే చాలా ఇష్టంకదే - నువ్వు మా మావగారికి చెప్పి పెట్టకుండా సంబంధం కుదిర్చావు'' అన్నాడు వైజయంతి మిలిటరీ మొగుడు భాస్కర్.

''నాకేం తెలుసురా నాయనా! అల్లుడన్నాక అచ్చటా ముచ్చటా వుంటాయనుకున్నాను. ఎప్పుడూ ఏడుపు ముఖాల్తో వుంటారనుకోలేదు. అయినా నీ పెళ్లాం ఎదురుగా నిలబడి వుందిగా దీపస్సెమ్మలా అడుగు'' అంది అతని తల్లి ఆదిలక్ష్మి.

''విన్నావా ముద్దుముఖివా. మొగుడి మనసులో మాట గ్రహించి ముచ్చట తీర్చే ముఖం కాదే ఇది. దరిద్రగొట్టు ముఖం''

''ఇంకా మా నాన్నదగ్గరేముంది ఇవ్వడానికి. అంతా నాకే పెడితే మిగిలిన పిల్లలకేం పెడ్తారు'' అంది వైజయంతి.

''సన్న సన్నగా ముఖం బద్దలు కొట్టినట్టు చెప్పింది. చూడు. అయినా మొదటి సంబంధం పిల్లని ఫ్రెష్‌గా చేసుకోరా అంటే విన్నావుకావు'' అందా మహా తల్లి.

''నిజమేనే అమ్మా! ఈ ముదనష్టం చుట్టుకునే జాతకం నాకుంటే మంచి ఆలోచన నేనెలా చేస్తానూ? చెడిందాన్ని చేసుకుంటే బాగా ముట్టచెప్తారనుకున్నాను. దరిద్రం నా ఇంటికొచ్చి కూర్చుంది.

దుఃఖంతో ఏడుస్తూ ''ఏం నేనే రెండో సంబంధమా? మీరు కాదా?'' అంది.

''ముండా ఎదిరించి మాట్లాడుతావుటే. ప్రతిదానికీ ఏడుపొకటి నేర్చావు'' అంటూ లేచాడు మొగుడు.

''వాడికేం వాడు మగమహారాజు. రెండో పెళ్లయినా మూడో పెళ్లయినా వాడికేమే? ఆడముండవు నువ్వు అణిగిమణిగి వుండాలి'' అత్తగారి కంఠం అంతరిక్షానికి లేచింది.

లేచిన మొగుడు మరింక ఆలస్యం చేయకుండా వైజయంతి వెంటబడి పట్టుకుని వంగదీసి వీపుమీద పిడిగుద్దులు గుద్దేశాడు. అసలే అర్భక ప్రాణం. అందులో భయం... అక్కడే కుప్పకూలిపోయింది.

''కొట్టకొరేవ్. అది అసలే వట్టిమనిషికూడా కాదు. అందరూ నిన్నాడిపోసుకుంటారు'' అంటూ సన్నాయినొక్కులు నొక్కింది తల్లి.

ఈ విధంగా దినదినగండంగా వైజయంతి

రెండో కాపురం కొన్నాళ్లు సాగింది. చుట్టుప్రక్కల వాళ్లద్వారా విషయం తెలిసి, కౌసల్యా, స్వామి వెళ్లి పిల్లని పంపమంటే పంపననేశాడు అల్లుడు. కౌసల్య కంగారుపడి బావురుమంది.

''ఇప్పుడు తీసుకెళ్తే మళ్లీ పంపడమంటూ పెట్టుకోకండి. మీ పిల్లని మీ ఇంట్లోనే వుంచుకోండి'' అంటూ ఖరాఖండిగా చెప్పేసింది అత్తగారు.

వదిలివస్తే పిల్ల మరింక దక్కదని నిండు నెలల్లో వున్న వైజయంతిని ఇంటికి తీసుకొచ్చేశారు కౌసల్యా, స్వామి.

పురుడొచ్చినా, పిల్లాడు పుట్టినా ఎన్ని ఉత్తరాలు రాసినా, కబుర్లే చేసినా అటువైపు వారు వులుకులేదు. పలుకులేదు. చివరికొచ్చిన నోటీసు చూసుకుని తల్లీ, తండ్రీ మంచాన పడ్డారు. వైజయంతి మాత్రం మౌనం వహించింది.

★ ★ ★

ఉత్తరం చదువుతూ, మధ్యలో అనుభవాలు నెమరేసుకుంటూ మళ్లీ ఉత్తరం చదువుతూ పూర్తిచేసేసరికి రమాదేవి కళ్లు నయాగారాలయ్యాయి.

ఆరోజు గేటు తీసుకుని లోపలికెళ్తుంటే ఎదురుగా వైజయంతి దీనంగా, కళావిహీనంగా ఎదురొచ్చింది.

ఆమె కొంగుపట్టుకుని గారాలుపోతూ, ఏడుస్తూ రెండేళ్ల పిల్లాడు.

అనాదిగా ఈ భరతఖండంలో ఇది ఆనవాయితీగా వస్తున్నదే.

పురుషుడెంత ఘోరంగా మోసగించినా, కన్నబిడ్డని బాధ్యతగా అష్టకష్టాలు పడి సాకింది శకుంతల.

భర్త ఎంతటి అవమానానికి గురిచేసినా లవకుశల్ని పెంచి పెద్దచేసింది సీత.

ఏదో నాటకం చూస్తున్న ప్రేక్షకురాలిలా నిలబడిపోయింది రమాదేవి.

★ ★ ★

## కపిల్ రికార్డ్స్



''కపిల్ మన దేశ క్రికెట్ చరిత్రలో ఓ అద్భుతమైన క్రికెటర్! అతడ్ని రిటైర్ అవ్వమని నేనెప్పుడూ చెప్పలేదు! ఒకవేళ నేను అతడ్ని సపోర్ట్ చేయకపోతే... అతడు వరల్డ్ రికార్డు సాధించి వుండేవాడుకాదు'' ఈ మాటలన్నది ఎవరో తెల్సా? అజారుద్దీన్! అయినా అజర్‌గారూ... ఎందుకుసార్ ఇలాంటి చర్చలు!!

- జూపిటర్